సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 8 । జులై । 2023



చైతన్య వంతులు కావాలి

గిరిజన యువకులు చైతన్యవంతులై అన్ని రంగాల్లో రాణించాలని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివ కిషోర్ తెలిపారు. IIలో



విద్యార్థుల ప్రగతికి కృషి

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచి వారి ప్రగతికి కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. IIలో



విత్తన శుద్ధి అవసరం IIలో

విత్తనశుద్ధితో తెగుళ్లు నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగ రైతు సాధికార సంస్థ యూనిట్ ఇన్‌చార్జి ప్రసాద్ తెలిపారు.

న్యూస్‌రీల్

4,235 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

సాక్షి,పాడేరు: జిల్లాలోని 13 మండలాల పరిధిలో 18 సచివాలయాల్లో జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాలను శుక్రవారం విజయవంతంగా నిర్వహించినట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. 19,529 గృహాల నుంచి వలంటీర్లు వివిధ ధ్రువీకరణ పత్రాల నిమిత్తం 17,064 వినతులను స్వీకరించారన్నారు. 15,941 టోకెన్లు నమోదు చేసి, 11,721 ధ్రువీకరణపత్రాలను మంజూరు చేసినట్టు తెలిపారు. 68 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, సాయంత్రం నాటికి 4,235 పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని పేర్కొన్నారు. మిగిలిన 7,418 సరిఫికెట్లను రెండు రోజుల్లోగా పంపిణీ పూర్తిచేయాలని తగిన ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు.

10న జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు

ఈనెల 10వ తేదీ సోమవారం జిల్లాలోని 10 మండలాల్లోని 15 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.

మారుమూల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్

- కాలినడకన వెళ్లిన వైద్య సిబ్బంది




మందులను మోసుకుంటూ నడిచి వెళ్తున్న వైద్యాధికారి, సిబ్బంది

పెదబయలు: మండలంలోని రూడకోట పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల జామిగుడ పంచాయతీ కేంద్రంలో వైద్యాధికారి పి.సత్యారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. జామిగుడకు కిలోమీటరు దూరంలో కల్వర్టు పనులు జరుగుతుండడంతో 104 వాహనం వెళ్లడానికి వీలుపడలేదు. దీంతో వైద్యాధికారి, సిబ్బంది మందులు మోసుకుంటూ గ్రామానికి కాలినడకన వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 51 మందికి వైద్య సేవలందించారు. గర్భిణులకు హిమోగ్లోబిన్, మధుమేహ పరీక్షలు జరిపారు. నెలనెలా వైద్యపరీక్షల కోసం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న రూడకోట పీహెచ్‌సీకి వెళ్లేవారమని, ఇప్పుడు వైద్యాధికారి మా ఇంటి వద్దకు వస్తున్నారని గర్భిణులు, బాలింతలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మంజుల,ఏఎన్‌ఎం,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లు స్వాధీనం

మోతుగూడెం : అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను మోతుగూడెం ఫారెస్ట్ సర్కిల్ పరిధిలో తులసిపాక ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం పట్టుకున్నారు. మన రాష్ట్రం నుంచి ఒడిశాకు ఆటోలో తాబేళ్లను తరలిస్తున్న ఇద్దరిని ఎఫ్ఆర్‌వో నానాజీ ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. నిందితుల నుంచి 172 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. బతికి ఉన్న 116 తాబేళ్లను శబరినదిలో విడిచిపెట్టి, చనిపోయిన 56 తాబేళ్లను అటవీశాఖ కార్యాలయం వద్ద లో ఖననం చేశారు. వీటిని రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం 79 గ్రామానికి చెందిన రాకేష్ మజుంధర్, మన రాష్ట్రంలో నెల్లూరుకు చెందిన విశాల్‌ను అరెస్ట్ చేసి రంపచోడవరం కోర్టులో హాజరు పరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.ఈ తనిఖీలో లక్కవరం రేంజ్ ఎఫ్ఎస్‌వో విజయ కుమార్, ఎఫ్‌బీవో సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

చెరగని ప్రగతి సంతకం.. వైఎస్సార్



ఆయన చూపులు... సుదీర్ఘ పరిచయపు
చిరునవ్వును చిందిస్తూ, అందరి వైపూ
ఆత్మీయంగా ప్రసరిస్తాయి.
ఆయన చేతులు... సదా ఏదో ఇవ్వడానికే
తామున్నట్టు ఓ ఆత్మీయ స్పర్శో,
చల్లని దీవెనో కురిపిస్తుంటాయి.
ఆయన పాదాలు.. ఆపన్నుల్ని
ఆదుకునేందుకు, బడుగుల బతుక్కు
కొత్త భరోసా ఇచ్చేందుకు
నిరంతరం తపిస్తుంటాయి.
ఆయన తెలుగునాట గుండె కింద
ఆరని తడి.. ఏళ్లు గడిచినా మరపురాని
జ్ఞాపకాల జడి...

- మరపురాని మహానేత గురుతులు
- ఉమ్మడి విశాఖ జిల్లాకు రాజశేఖరుడి హయాంలో మహర్దశ
- విశాఖ సమగ్రాభివృద్ధికి ఆనాడే అడుగులు
- నాడు వైఎస్సార్ వేసిన అభివృద్ధి బాట.. నేడు పరిపాలనా రాజధానికి పూలబాట
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి



సామాన్యులకు సైతం అత్యున్నత వైద్యం అందుబాటులోకి తెచ్చిన మహానేత వైఎస్సార్

సాక్షి, విశాఖపట్నం : మహానేత వైఎస్సార్ మానస పుత్రికగా విశాఖ నగరం ఉజ్వలంగా వెలుగొందింది. ప్రతి రంగంలోనూ ప్రగతికి బాటలు వేసి.. పల్లె, పట్టణమని తేడా లేకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలో అభివృద్ధికి నాంది పలికారాయన. లెక్కలేనన్ని ప్రతిపాదనలకు కార్యరూపమిచ్చారు. అభ్యున్నతికి ఆలంబనగా సాగిన వైఎస్సార్ పాలనలో విశాఖ.. సరికొత్తగా ఆవిష్కృతమైంది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నిర్లక్ష్య పాలన సాగించడంతో.. ప్రగతి గతి తప్పి.. విశాఖ వైభవానికి చెదలు పట్టాయి. మళ్లీ ముఖ్యమంత్రిగా 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. విశాఖ నగరం విశ్వనగరంగా దూసుకుపోతోంది. త్వరలో పరిపాలనా రాజధాని కానుంది. శనివారం వైఎస్సార్ జయంతి సందర్భంగా రాజన్న చేపట్టిన అభివృద్ధి.. సంక్షేమాలను గుర్తు చేసుకుందాం.

విశాఖ ఐటీకీ జీవం పోసింది వైఎస్సార్

ఐటీ ప్రగతి ఒక్క హైదరాబాద్‌కే పరిమితం కాకుండా వికేంద్రీకరణ జరగాలని భావించారు. ముందు చూపుతో ఐటీ రంగానికి విశాఖను హబ్‌గా మార్చాలనే వైఎస్సార్ ఐటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అప్పటివరకు కేవలం పర్యాటక నగరంగా మాత్రమే పరిగణించే స్థితిలో ఉన్న విశాఖను ఐటీ రంగంలో మేటిగా తీర్చిదిద్దారు. విశాఖలో మూడు కొండల్ని, కొండల కింద ఉన్న సుమారు 100 ఎకరాల పల్లపు ప్రాంతాన్ని ఎంపిక చేశారు. కనీసం 100 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే ఐటీ కంపెనీలకు మాత్రమే అవకాశమిచ్చి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు ప్లాట్లుగా డివైడ్ చేసి అందించారు. వైఎస్ ఆలోచనలను మెచ్చి సుమారు 200 కంపెనీలు ముందుకొచ్చాయి. ఇందులో కొద్ది కాలంలోనే 70 శాతం కంపెనీలు కార్యకలాపాల్ని ప్రారంభించాయి. సత్యం, విప్రో కంపెనీలూ విశాఖలోనూ శాఖలను విస్తరించాయి. వైఎస్సార్ మరణం తర్వాత.. ఆయనతోపాటే ఐటీ గ్రాఫ్ కూడా కనుమరుగైపోయింది. ఎగుమతులు పడిపోయాయి. టీడీపీ హయాంలో ఒక్కొక్క కంపెనీ వెనక్కు వెళ్లిపోయాయి. దాదాపు పదేళ్లు విశాఖ ప్ర'గతి' తప్పింది. మళ్లీ 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నుంచి ఐటీ రంగం పరుగులు పెడుతోంది. విశాఖ నగరంలో ఇన్ఫోసిస్ కార్యకలాపాలకు సిద్ధమైంది. డేటా అదాని సెంటర్ శంకుస్థాపన జరిగింది. దీంతో విశాఖ ఐటీ కళ సంతరించుకుంది.

దేశంలోని టాప్ నగరాల్లో ఒకటిగా..

దేశంలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం అమలైన 63 నగరాల్లో వైజాగ్‌ను చేర్చిన ఘనత వైఎస్సార్‌దే. జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ పథకం (జెఎన్‌ఎన్‌యూఆర్‌ఎం)లో విశాఖ నగరాన్ని చేర్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన చొరవతో నగరానికి రూ.1,885 కోట్ల విలువైన పనులు దక్కాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా 20 శాతం కూడా ఎప్పటికప్పుడు జీవీఎంసీకి అందజేసేలా చర్యలు తీసుకున్నారు. సింహాచలం, పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్లు, ఆశీల్‌మెట్ట ఫ్లైఓవర్, విలీన గ్రామాలకు తాగునీటి సౌకర్యంతోపాటు భూగర్భ మురుగు నీటి వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పన మొదలైన 20 ప్రాజెక్టులను వైఎస్సార్ తీసుకొచ్చారు. సెంట్రల్ సిటీలో రూ.244 కోట్లతో 750 కి.మీ మేర యూజీడీ పనులు చేపట్టారు.

యువతకు ఉపాధి... భవితకు పునాది

2008 జనవరి 2వ తేదీన ఉపాధి పథకాన్ని వైఎస్సార్ ప్రారంభించారు. రూ.5 కోట్లను కేటాయిస్తూ 18–35 ఏళ్ల మధ్య వయసున్న యువతకు 13 అంశాల్లో శిక్షణ ఇచ్చి, ఆ శిక్షణ సంస్థల ద్వారానే 70 శాతం వరకూ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ గార్డ్స్, సర్ఫేస్ ఆర్నమెంట్స్.. మొదలైన అంశాల్లో శిక్షణ తీసుకొని ఉపాధి పొందిన వారెందరో ఉన్నారు. ఆయన మరణించిన తర్వాత ఈ పథకాన్ని పూర్తిగా విస్మరించేశారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలలకే.. సచివాలయ వ్యవస్థను రూపొందించి 4 లక్షలకు పైగా ఉద్యోగాలను అందించారు.

అంతర్జాతీయ హోదా ఆయన ఘనతే...

హైదరాబాద్‌కే పరిమితమైన అంతర్జాతీయ విమానాశ్రయ సర్వీసులను విశాఖ ప్రజలకూ పరిచయం చెయ్యాలని వైఎస్సార్ సంకల్పించారు. అనుకున్నదే తడవుగా రూ.100 కోట్లు వెచ్చించి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా తీసుకొచ్చారు. టీడీపీ హయాంలో విమానయాన సంస్థలకు అందించాల్సిన రాయితీలు చెల్లించకపోవడంతో అనేక సర్వీసులు నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మళ్లీ సర్వీసులు మొదలయ్యాయి. అంతే కాకుండా మొదటి సారిగా.. విశాఖ నుంచి సరకు రవాణా కోసం కార్గో సర్వీసు కూడా ప్రారంభమైంది. ఇటీవల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన కూడా చేశారు.

విమ్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన మహానేత

వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజలకు హైదరాబాద్ నిమ్స్ తరహాలో అత్యుత్తమ సేవలు అందించేందుకు విమ్స్‌కు 2006లో వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. 1,130 పడకలు, 21 సూపర్ సెషాలిటీ బ్లాకులతో రూ.250 కోట్లతో విమ్స్ ఆస్పత్రికి 2007లో శంకుస్థాపన చేశారు. 2009 డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని అనుకున్నారు. కానీ.. ఆయన మరణించాక విమ్స్‌ని పట్టించుకోలేదు. 2014లో చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.30 కోట్లు మాత్రమే కేటాయించింది. 2016 ఏప్రిల్‌లో అందుబాటులోకి వచ్చింది. అంతా సవ్యంగా సాగుతున్న తరుణంలో చంద్రబాబు ప్రభుత్వం విమ్స్‌ని ప్రైవేట్ పరం చేసేందుకు కుయుక్తులు పన్నింది. ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ఈ ప్రయత్నాన్ని అడ్డుకుంది. గతంలో కోవిడ్ సమయంలో విమ్స్‌ని స్టేట్ కోవిడ్ హాస్పిటల్‌గా మార్చింది. ప్రస్తుతం అటు విమ్స్, ఇటు కేజీహెచ్ రోగులకు అత్యుత్తమ సేవలందిస్తున్నాయి.

గిరిజనులకు బాసటగా...

పోడు వ్యవసాయం చేయడం నేరంగా పరిగణించేవారు. దీంతో.. జీవనాధారం లేక.. దీనావస్థలో కొట్టుమిట్టాడుతున్న గిరిజనానికి బాసటగా నిలిచారు రాజన్న. ఏజెన్సీలోని అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న గిరిజనులకు అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా 2009 జూలై 12న వైఎస్ రాజశేఖర రెడ్డి హక్కు పత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. తొలివిడత 29,396 మంది గిరిజన లబ్ధిదారులకు 56412.02 ఎకరాల అటవీ భూమి, రెండో విడత 2,470 మంది లబ్ధిదారులకు 7190.32 ఎకరాల అటవీభూములపై హక్కు కల్పించారు. రాజన్న చొరవతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాయి. అందుకే ఇప్పటికీ వైఎస్సార్‌ను గిరిజనులు దేవుడిలా భావిస్తారు. మళ్లీ ఆయన తనయుడు వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు హక్కు పత్రాలు మంజూరు చేశారు.

కాఫీ ప్లాంటేషన్ ప్రాజెక్ట్

ఏజెన్సీలో కాఫీప్లాంటేషన్ ప్రాజెక్టు తీసుకొచ్చింది కూడా వైఎస్ రాజశేఖర్‌రెడ్డే. ఆయన హయాంలో ఈ ప్లాంటేషన్‌కు రూ.144 కోట్లు కేటాయించారు. పాడేరు, అరకు ప్రాంతాల్లో సుమారు 60వేల ఎకరాల కాఫీ ప్లాంటేషన్ ద్వారా దాదాపు 60వేల మంది గిరిజనులకు ఉపాధి కల్పిస్తూ.. ఆర్థిక భరోసా ఇచ్చారు.

నాడు నాటిన మొక్క.. నేడు నీడనిస్తూ..



సాక్షి,పాడేరు: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రి అయిన తర్వాత పాడేరులో పర్యటించి, పాలిటెక్నిక్ వద్ద నాటిన కదంబ మొక్క నేడు పెద్ద చెట్టయింది. అటవీహక్కుల చట్టం కింద హక్కు పత్రాల పంపిణీకి అప్పట్లో మహానేత పాడేరు వచ్చారు. ఆ సమయంలో పాలిటెక్నిక్ కళాశాల వద్ద స్వయంగా మొక్క నాటారు. ఆ మొక్కను పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యంతో పాటు అటవీశాఖ అధికారులు అపురూపంగా సంరక్షిస్తున్నారు. దాని చుట్టూ సిమెంట్‌తో ప్లాట్‌ఫారంను నిర్మించారు. దీంతో ఆ చెట్టు కిందనే కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఇక్కడ మెడికల్ కళాశాల నిర్మాణ దారులు సేదతీరుతూ మహానేత వైఎస్సార్‌ను గుర్తు చేసుకుంటున్నారు.

పాలిటెక్నిక్ కళాశాల వద్ద మహానేత వైఎస్సార్ నాటిన కదంబ మొక్క

నేడు జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు

ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



సాక్షి,పాడేరు: మహానేత, దివంగత సీఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. అన్ని మండలాల్లో మహానేత వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేసి ఘనంగా నివాళులర్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు,రోగులకు పాలు,రొట్టెలు,పండ్లు, పేదలకు దుస్తులు పంపిణీ చేయాలని, అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న నేతలు, సచివాలయ కన్వీనర్లు,గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆమె కోరారు.

ఆమోదయోగ్యంగా కాలనీల నిర్మాణం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న నిర్వాసితులను ఆదుకునేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. వారికి పునరావాసం కల్పించేందుకు ఇతర మండలాల్లో భూసేకరణ కార్యక్రమం కూడా ముమ్మరం చేసింది. ఇటీవల ప్రాధాన్యతా క్రమంలో చేర్చిన 17 గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. దీనిలో భాగంగా పునరావాస కాలనీల నిర్మాణాలపై నిర్వాసితులకు అవగాహన కల్పించేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

- గిరిజనులకు షెడ్యూల్ ఏరియాలోనే పునరావాసం
- చింతూరులో నిర్వాసిత కమిటీల అవగాహన సమావేశం



మాట్లాడుతున్న ఎస్డీసీ మురళి

చింతూరు: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో భాగంగా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా కాలనీల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం వారు పోలవరం ముంపు కుటుంబాలకు సంబంధించిన నిర్వాసిత కమిటీలతో అవగాహన సమావేశం నిర్వహించారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో ఇటీవల ప్రాధాన్యతా క్రమంలో చేర్చిన 17 గ్రామాలకు సంబంధించిన గిరిజనుల పునరావాస ప్రక్రియపై ఈ సమావేశంలో కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్డీసీలు మాట్లాడుతూ గిరిజనులకు షెడ్యూల్ ఏరియాలోనే పునరావాసం కల్పించడం జరుగుతుందని తెలిపారు. మూడు మండలాల గిరిజన నిర్వాసిత కుటుంబాలకు ఎటపాక మండలంలో ప్రధాన రహదారి పక్కనే పునరావాస కాలనీలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వారు తెలిపారు.

17 గ్రామాలు, 3,225 కుటుంబాలు

చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో ప్రాధాన్యతా క్రమంలో భాగంగా మొదటి ఫేజ్‌లో 17 గ్రామాలకు చెందిన 3,225 గిరిజన కుటుంబాలకు పునరావాస ప్రక్రియ చేపట్టాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ కుటుంబాలకు ఎటపాక మండలంలోని రామగోపాలపురం, లక్ష్మీపురం, లింగాలపల్లి, నర్సింగపేట, బూరుగువాడలో కాలనీల నిర్మాణాలకు ప్రభుత్వ స్థలాన్ని సేకరించినట్టు వారు తెలిపారు. ఎకరం స్థలంలో 12 కుటుంబాలకు, ప్రతీ కుటుంబానికి ఐదు సెంట్ల స్థలంలో ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు రహదారి, డ్రైనేజ్, ఇతర సౌకర్యాలు కల్పిస్తారని వారు తెలిపారు. నిర్వాసిత కుటుంబాలను కాలనీలు నిర్మించబోయే ప్రాంతాలకు తీసుకెళ్లి చూపించడం జరుగుతుందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు కారం సుబ్బారావు, శ్రీధర్, అనసూయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమీపంలోనే సాగు భూముల్వివాలని, కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

'ఏకలవ్య' విద్యార్థిని మృతి



జస్విత (ఫైల్)

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 11వ తరగతి చదువుతున్న మడిగుంట జస్విత(16) అనే గిరిజన విద్యార్థిని శుక్రవారం కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందింది. మండలంలోని బొడ్డపల్లి గ్రామానికి చెందిన ఆ విద్యార్థిని గతనెల 19వ తేదీన ఆ పాఠశాలలో 11వ తరగతిలో జాయిన్ అయింది. ఆమెకు తీవ్రంగా జ్వరం రావడంతో స్థానిక సీహెచ్‌సీలో జాయిన్‌చేశారు. జ్వరం తగ్గకపోవడంతో కాకినాడ రిఫర్ చేశారు. కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈవిషయంపై ఆపాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణను వివరణ కోరగా ఈనెల 2వ తేదీ రాత్రి ఆ విద్యార్థినికి జ్వరం వచ్చిందని తెలిపారు. 3వ తేదీన చవిటిదిబ్బలు పీహెచ్‌సీకి తీసుకువెళ్లమన్నారు. రక్త పరీక్షలు చేసి, మలేరియా మొదటి డోసు మాత్రలు ఇచ్చినట్టు తెలిపారు. మలేరియా నిర్ధారణ కావడంతో 4న వై.రామవరం సీహెచ్‌సీలో జాయిన్ చేశామని చెప్పారు. జ్వరం తగ్గు ముఖం పట్టకపోవడంతో 5వ తేదీ రాత్రి కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్‌చేయగా, విద్యార్థిని ఆ ఆస్పత్రికి తీసుకెళ్లామని, తల్లిదండ్రులను, పాఠశాల సిబ్బందిని వెంట పంపించామన్నారు. చికిత్స అందిస్తుండగా 7వ తేదీ ఉదయం చనిపోయిందని ప్రిన్సిపాల్ విచారం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సుమిత్ కుమార్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: స్పందన సమస్యల పరిష్కారంపై అన్నిశాఖల అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 135 వినతులను కలెక్టర్‌తో పాటు జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, డీఆర్వో అంబేడ్కర్‌లు స్వీకరించారు. అనంతరం అన్నిశాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం,స్పందన వినతులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతీ వారం సమీక్షిస్తున్నట్టు తెలిపారు. అన్నిశాఖల జిల్లా అధికారులు ప్రతి నెల రంపచోడవరం,చింతూరు డివిజన్‌లలో కూడా పర్యటించి,అక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నియోజకవర్గాల వారీగా అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలుతీరుపై సమీక్షిస్తారని, జిల్లా అధికారులు సమగ్ర వివరాలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు,పలు ఇంజినీరింగ్ విభాగాల ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు ,కొండయ్యపడాల్, లీలాకృష్ణ,బాలసుందరబాబు,డీపీవో కొండలరావు,జిల్లా వ్యవసాయ,ఉద్యానవన శాఖాధికారులు నందు,రమేష్‌కుమార్‌తో పాటు పలుశాఖల జిల్లా అధికారులు, పాడేరు.హుకుంపేట తహసీల్దార్‌లు త్రినాథరావునాయుడు,రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

- హుకుంపేట పంచాయతీ కేంద్రంలో తాగునీటి పథకాన్ని వినియోగంలోకి తేవాలని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎలక్ట్రీషియన్‌ను నియమించాలని, అన్ని గ్రామాల్లో పెండింగ్‌లో సీసీరోడ్లు నిర్మించాలని,పారిశుధ్య పనులకు అధికంగా క్లాప్‌మిత్రాలను నియమించాలని సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ కలెక్టర్‌ను కోరారు.
- డుంబ్రిగుడ మండలం సర్రాయి పాఠశాల భవనం ప్రమాదభరితంగా కూలడానికి సిద్ధంగా ఉందని,కొత్త భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు పి.భగవతి,కృష్ణలు కోరారు.
- పెదబయలు మండలం జామిగుడ పంచాయతీ పిట్టలబొర్ర గ్రామం నుంచి చింతలవీధి గ్రామం వరకు తారురోడ్డు నిర్మించాలని గిన్నెలకోట ఎంపీటీసీ గడుతూరి నిర్మల కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఐటీడీఏ సమావేశమందిరంలో అనంతగిరి మండలానికి చెందిన 25 స్వయంసహాయక సంఘాలకు రూ.1,47,50,000 బ్యాంకు లింకేజి రుణాల చెక్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్,జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్,ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌లు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సొమ్మును స్వయం ఉపాధి అవకాశాలకు వినియోగించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో అంబేడ్కర్,ఎస్‌డీసీ వి.వి.ఎస్.శర్మ,డీఆర్‌డీఏ పీడీ వి.మురళి,ఎల్‌డీఎం రవితేజ పాల్గొన్నారు.

వీఆర్వో పనితీరుపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



పెదబయలులులో వీఆర్వోపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

పెదబయలు: మండలంలోని సీతగుంట గ్రామ సచివాలయంలో శుక్రవారం జరిగిన గడప గపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీతగుంట పంచాయతీ వీఆర్వో కె.సత్యారావు ప్రతి పనికి చేతివాటం ప్రదర్శిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి పెదబయలు గ్రామ మహిళలు ఫిర్యాదు చేశారు. పలువురు మాట్లాడుతూ కులు, ఆదాయ తదితర ధ్రువపత్రాల జారీకి సొమ్ము డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, దీనిపై విచారణ చేపడతామన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఆదాయ, కుల, తదితర ధ్రువ పత్రాలను ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా పొందవచ్చని చెప్పారు.

విత్తన శుద్ధి అవసరం



పాలకొండ గ్రామంలో బీజామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సాధికార సంస్థ యూనిట్ ఇన్‌చార్జి ప్రసాద్



చింతపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఆర్ఏఆర్ఎస్ అధికారులు

జి.మాడుగుల: మండలంలోని ఎం.నిట్టాపుట్టు యూనిట్ పాలకొండ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగ రైతు సాధికార సంస్థ యూనిట్ ఇన్‌చార్జి ఎం.ప్రసాద్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 13 పంచాయతీల్లో 4 యూనిట్స్ 32 గ్రామైక్య సంఘాల ద్వారా ప్రకృతి సాగుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధితో పంటల తెగుళ్లను నివారించవచ్చన్నారు. భూసారం పెంచేందుకు బీజామృతాన్ని వినియోగించాలని సూచించారు. రసాయన ఎరువుల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మహిళా రైతులు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

జీడిమామిడిలో ఎండుకొమ్మలను తొలగిస్తే మేలు

కొయ్యూరు: మండలంలోని కినపర్తిలో గ్రామ స్వరాజ్య సమితి ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శైలజ, ప్రవీణ్‌లు స్థానిక జీడి రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ జీడిమామిడి తోటల్లో ఎండుకొమ్మలను తొలగిస్తే తటలకు మేలు జరుగుతుందన్నారు. తోటల్లో ఎండు కొమ్మల తొలగింపు, సస్యరక్షణ చర్యలు వల్ల కలిగే లాభాలను వివరించారు. గ్రామ స్వరాజ్య సమితి కార్యదర్శి వి.రాము, ప్రకృతి వ్యవసాయ కో-ఆర్డినేటర్ డి.వి.నాయుడు, శ్రీనివాష్, రోజ్‌మేరీ, లోవరాజు పాల్గొన్నారు.

దేశీయ విత్తనాల సంరక్షణకు చర్యలు

చింతపల్లిరూరల్: దేశీయ విత్తనాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్థానిక పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక పరిశోధన స్థానంలో శుక్రవారం దేశీ విత్తనాల సంరక్షణ, ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశీయ విత్తనాల వలన రైతులు మంచి ఫలితాలు పొందడానికై వాటిలో జీవ వైవిధ్యం పెంచుట కొరకు సామూహికంగా ద్రవ, ఘన జీవామృతాల తయారీపై శిక్షణ ఇచ్చామన్నారు. నార్త్ కోస్టల్ రీజనల్ టీమ్ ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీవో హెమసుందర్, శాస్త్రవేత్త సందీప్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో చౌడుపల్లిలో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కకుల వెంకటరావు ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లోతుగడ్డలో గిరిజనులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొరాబు అనూషదేవి,జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య,సర్పంచుల సంఘం అధ్యక్షురాలు దురియా పుష్పలత,ఎంపీడీవో ఆశాజ్యోతి,తహసీల్దార్ లచ్చపాత్రుడు,చౌడుపల్లి సర్పంచ్ లలిత,మండల కన్వీనర్గణబాబు, వైఎస్సార్‌సీపీ మండల మోరి రవి పాల్గొన్నారు.



సీకరిలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పారదర్శకంగా పథకాల మంజూరు : అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలోని సీకరి, అరడకోటల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ అర్హతే కొలమానంగా పథకాలు అందజేస్తున్నట్టు చెప్పారు. సీకరి గ్రామ సచివాలయం పరిధిలో 257 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్టు చెప్పారు. పారదర్శక పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, ఎంపీడీవో పూర్ణయ్య, ప్రత్యేక అధికారి సువర్ణ ఫణి, తహసీల్దార్ సీహెచ్, కృష్ణారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ సన్యాసి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వంతాల ఆనందరావు,మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు కృష్ణారావు,మత్స్యలింగం,మండల నాయకులు సూరయ్య,కనకరాజు, పాంగి సింహాచలం,అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్ట్



గంజాయి నిందితులతో సీఐ, ఎస్‌ఐ

అరకులోయ టౌన్: ఇద్దరు గంజాయి నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్టు అరకులోయ సీఐ రుద్ర ప్రతాప్ తెలిపారు. అరకులోయ సర్కిల్ పరిధిలో 12 కిలోల గంజాయి తరలించిన డుంబ్రిగుడ మండలం కంద్రుం పంచాయతీ జోడిగుడ గ్రామానికి చెందిన కిముడు జగన్నాథం(34)తో పాటు ఇదే మండలం కంద్రుం పంచాయతీకి చెందిన కిరణపై గతంలో అనంతగిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పారు. ఈఇద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సంతోష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతికి కృషి



టేకులవీధి ఆశ్రమపాఠశాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

గంగవరం: విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచి వారి ప్రగతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అన్నారు. శుక్రవారం టేకులవీధి (కొత్తాడ) గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. అన్ని సబ్జెక్టుల్లో మంచి ఫలితాలు సాధనకు సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులతో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. జగనన్న విద్యా కానుక, పుస్తకాలు, అందాయా, లేదా అని ప్రశ్నించారు. వసతి గృహంలో గిరిజన విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు.

టేకులవీధి ఆశ్రమపాఠశాలలో సమస్యలను సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎం.హాసిని, ప్రధానోపాధ్యాయుడు బి.నాగేశ్వరరావు పీవో దృష్టికి తీసుకెళ్లారు. ప్రహరీ, అదనపు తరగతి గదులు, భోజనశాల అవసరమని తెలిపారు. పీవో స్పందిస్తూ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు తరగతి గదుల నిర్మాణ అంశాన్ని ఎస్ఎస్ఏ జేఈతో ఫోన్‌లో చర్చించారు.

యువకులు చైతన్యవంతులు కావాలి

చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

కొయ్యూరు: గిరిజన యువకులు చైతన్యవంతులై అన్ని రంగాలలోను రాణించాలని చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్‌శివ కిషోర్ సూచించారు. మండలంలోని యూ.చీడిపాలెం పంచాయతీ పలకజీడిలో ఆయన శుక్రవారం పర్యటించారు. స్థానిక వారపు సంతకు వచ్చిన గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కిషోర్ మాట్లాడుతూ గిరిజన యువత ఉన్నత విద్య అభ్యసించాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించేందుకు కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు, రవాణా వంటి జోలికి పోవద్దన్నారు. గ్రామాల్లో రహదారులు, సెల్ టవర్లు ఏర్పాటవుతున్నాయని, మెరుగైన సౌకర్యాలు కలుగుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎండకోటచ, గొంధికోట, బంగరుబంద, నక్కలమెట్ట, సంగమవలస, పుట్టకోట, పెదలంక, మండపల్లి గ్రామాలకు చెందిన పలువురు మాట్లాడుతూ ఆధార్ కోసం ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆయన స్పందించారు. ఐటీడీఏ పీవోతో మాట్లాడి, త్వరలో ఆధార్ కేంద్రం ఏర్పాటుచేస్తామన్నారు. అర్హులందరికీ ప్రధానమంత్రి ఉపాధి పథకం ద్వారా ఉపాధి కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మావోయిస్టులకు ఎవరు సహకరించొద్దన్నారు. త్వరలో నిర్వహించనున్న మెగా వైద్య శిబిరానికి 20 మందికి పైగా వైద్య నిపుణులు వస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐలు లోకేష్ కుమార్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జైలు శిక్ష

విశాఖ లీగల్: ఆదాయానికి మించి ఆస్తి కలిగి ఉన్న పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగికి మూడేళ్ల జైలుశిక్ష, రూ 2లక్షలు జరిమాన విధిస్తూ నగరంలోని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. ఏసీబీ అధికారులు అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు ఏ.ఎస్. హరి గతంలో పంచాయతీ రాజ్ విభాగంలో ఉద్యోగిగా పని చేశారు. 1997లో అతనిపై ఏసీబి అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ బాజీలాల్

రాజవొమ్మంగి: గంజాయి అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టామని, వాహనాల తనిఖీలను ముమ్మరం చేశామని రాజవొమ్మంగి సీఐ బాజీలాల్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాత గంజాయి నేరస్తులు తిరిగి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. సారా విక్రయాలపై ఆరా తీస్తున్నామన్నారు. గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐలు గోపీనరేంద్రప్రసాద్, షరీఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా వ్యాపారి అరెస్టు

రాజవొమ్మంగి: అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామానికి చెందిన దుర్గ అనే సారా వ్యాపారిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. గతనెల 11న మండలంలోని కొండలింగంపర్తి గ్రామంలో 25 లీటర్ల సారాతో అప్పారావు అనే వ్యక్తి పట్టుబడినట్టు చెప్పారు. అతను అందజేసిన వివరాల ప్రకారం ఆ కేసులో రెండో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్ కప్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

మధురవాడ: జిల్లా స్థాయి సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ 10వ వైఎస్సార్ కప్ బాక్సింగ్ పోటీలు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలు మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, ఏపీ ఎలక్ట్రానిక్ అండ్ ఐటీ ఏజెన్సీస్ జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ. వెంకటేశ్వరరావు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని జిల్లా బాక్సింగ్ క్లబ్ పర్యవేక్షణలో మారుతీ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు పోటీలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 40 క్లబ్‌ల నుంచి 200మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. ఆనందరావు, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి, బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మహంతి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ప్రకాశ్, వెంకటరావు, గోపి, బంక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్లలో శుక్రవారం పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరాయని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. చెన్నై సెంట్రల్‌లో రాత్రి 7.20 గంటలకు బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్-హౌరా(12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయలుదేరింది. హౌరాలో రాత్రి 11.55 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా శనివారం తెల్లవారుజాము 4 గంటలకు బయలుదేరింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వీఆర్వో మృతి



జోగారావు(ఫైల్)

ఎటపాక: మండలంలోని టీపీ వీడు గ్రామ సచివాలయంలో వీఆర్వోగా పని చేస్తున్న కరక జోగారావు(57) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఈనెల 4న ఎటపాక తహసీల్దార్ కార్యాలయంలో విధులు ముగించుకుని మరో వీఆర్వోతో కలిసి ద్విచక్ర వాహనంపై తాను నివాసం ఉంటున్న వీఆర్‌పురం మండలం రేఖపల్లి గ్రామానికి బయలు దేరారు. కూనవరం మండలం కూల్లపాడు సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి, ఇద్దరూ కిందపడిపోయారు. ఈప్రమాదంలో జోగారావు,మరో వీఆర్వో సత్యనారాయణకు గాయాలయ్యాయి. వీరిద్దరూ రేఖపల్లి వెళ్లి ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నారు. అయితే తెల్లవారుజామున జోగారావుకు తీవ్ర అనారోగ్యం ఏర్పడడంతో హుటాహుటిన భద్రాచలం తరలించి వైద్య పరీక్షలు చేయించారు. గాయం కారణంగా తలలో రక్త స్రావం జరుగుతోందని, దీనికారణంగా కోమాలోకి వెళ్లినట్టు వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం బుధవారం ఖమ్మం తరలించారు. అక్కడ వైద్యం చేయించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో గురువారం భద్రాచలం తీసుకువచ్చి ఓఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. మృతదేహాన్ని అతని స్వగ్రామం కూనవరం మండలంలోని కరకగూడెంకు తరలించారు. టీపీవీడు సచివాలయంలో పనిచేస్తున్న కార్యదర్శి, వీఆర్వో,ఉప సర్పంచ్ ఏడాది కాలంలోనే రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. అదేవిధంగా ఎంపీటీసీ పిడుగు పాటుతో చనిపోయారు.

డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంపీడీవో, మలేరియా సబ్ యూనిట్ అధికారులతో పీవో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు డివిజన్లలో మలేరియా, డెంగ్యూ నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గత నెలలో చేసిన రక్త పరీక్షలు, ఎంతమందికి మలేరియా, డెంగ్యూ నిర్ధారణ అయింది తదితర వివరాలను పీహెచ్‌సీల వారీగా తెలుసుకున్నారు. గ్రామంలో ఎవరికైన జ్వరం ఉందని తెలియగానే రక్త పరీక్షలు చేసి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఎంపీడీవోలు హరికృష్ణ, బాప్పన్న దొర, రత్న కుమారి, వైద్యాధికారులు నరేష్, రాధిక, మలేరియా ఎంవో నక్క వెంకటేశ్వరరావు, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.